ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

అనంతపురం
జిల్లా వార్తలు
గురువారం 11 జనవరి 2024


ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికుల ర్యాలీ


ముస్సిపల్ ఆర్డీ కార్యాలయం ఎదుట కార్మికుల బైఠాయింపు

మండిపడ్డ మున్సిపల్ కార్మికులు ఆర్డీ కార్యాలయ ముట్టడి.. ఉద్రిక్తత

సీఎం జగన్ మోసగించారు


భిక్షాటన చేస్తున్న కార్మికులు


భిక్ష వేస్తున్న మేయర్ వసీం


మున్సిపల్ ఆర్డీ కార్యాలయం ముట్టడి


అలిగి వెళ్లిపోతున్న పోలీసులు

అనంతపురం క్రైం, జనవరి 10: సీఎం జగన్ తమను మోసగించారని మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో వారు చేపట్టిన సమ్మె బుధవారం 16వ రోజు కొనసాగింది. అనంతపురం కార్పొరేషన్‌తో పాటు మున్సిపాలిటీ కేంద్రాల్లో కార్మికులు నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి తిరుమలేష్ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని 50 డివిజన్ల పరిధిలో మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు భిక్షాటన చేశారు. నగరపాలిక కార్యాలయంలో అధికారుల వద్దకు వెళ్లి భిక్షం అడిగారు. మేయర్ మహమ్మద్ వసీం కోసం ఆయన వ్యాపారం నిర్వహిస్తున్న దుకాణంలోకి వెళ్లారు. వారికి మేయర్ రూ.100, ఓ కార్పొరేటర్ రూ.50 భిక్షం వేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజేష్‌గౌడ్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి ఆధ్వర్యంలో రీజియన్ పరిధిలోని ఆరు జిల్లాల మున్సిపల్ కార్మికులు నగరంలోని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ) కార్యాలయ ముట్టడికి యత్నించారు. ఈ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసులు, కార్మికుల మధ్య తోపులాట జరిగింది. ముట్టడిని అడ్డుకున్న పోలీసులు, 20 మంది నాయకులు, కార్మికులను అరెస్టు చేసి, సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టు చేసి తీసుకెళ్తుండగా పోలీసుల వాహనాలను కార్మికులు అడ్డుకున్నారు.



పోలీసులు సర్దిచెప్పినా కార్మికులు వినలేదు. ఆర్డీ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు 'మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి' అంటూ అలక వహించారు. ఆర్డీ కార్యాలయం గేట్లు తెరిచి.. ఎంతమందైనా వెళ్లండని చెప్పి సమీపంలోని చెట్ల కిందకు వెళ్లిపోయారు.


పోలీసులు, కార్మికుల మధ్య తోపులాట.. అరెస్టులు

సర్కారు వారి బెదిరింపులు..!

- మిమ్మల్ని ఎందుకు తొలగించకూడదు..?
- పది రోజుల్లో చెప్పకుంటే శాఖాపరమైన చర్యలు
- అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు నోటీసులు
- అయినా ఆగని పోరు.. 30వ రోజు ఆందోళనలు


కలెక్టరేట్ వద్ద రోడ్డుపై 30వ రోజును సూచించేలా ఆందోళన


విడపనకల్లులో అంగన్‌వాడీ సెంటర్‌కు నోటీసులు అతికిస్తున్న సిబ్బంది

అనంతపురం విద్య, జనవరి 10: అంగన్‌వాడీల సమ్మెను అణచివేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. డెడ్‌లైన్ ముగిసినా విధులకు హాజరుకాకపోవడంతో వర్కర్లు, ఆయాలకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం ప్రారంభించింది. దీంతో సర్వత్రా ఉత్కంఠ పెరిగింది. 'మిమ్మల్ని ఉద్యోగాల నుంచి ఎందుకు తొలగించకూడదో పది రోజుల్లోగా చెప్పండి..' అని నోటీసుల్లో పేర్కొంది. ఒక వైపు ప్రభుత్వ డెడ్ లైన్.. మరో వైపు తగ్గేదే లేదంటున్న అంగన్వాడీల డేర్ లైన్. అటు అధికారులు... ఇటు అంగన్‌వాడీలు అన్నట్లుగా పరిస్థితి తయారైంది. డిసెంబరు 12వ తేదీ నుంచి అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నారు. ఇప్పటికి నెల గడిచింది. చర్చలు విఫలం కావడంతో ప్రభుత్వం చర్యలకు పూనుకుంది. ఈ నెల 9లోగా విధులకు హాజరు కావాలని డెడ్‌లైన్ విధించింది. కానీ అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు. దీంతో ఎస్మాను ప్రయోగించేలా జీవో నంబర్ 2ను ప్రభుత్వం జారీ చేసింది. ఇందులో భాగంగా బుధవారం నుంచి షోకాజ్ నోటీసులు ఇవ్వడం ప్రారంభించింది.

వేలాది మందికి..

వేలాది మంది వర్కర్లు, ఆయాలకు ఐసీడీఎస్ అధికారులు నోటీసులు ఇస్తున్నారు. పోస్టు ద్వారా వేలాది లెటర్లు బట్వాడా అవుతున్నాయి. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద నోటీసులు అతికించారు. ఐసీడీఎస్ అధికారుల లెక్కల మేరకు బుధవారం రాత్రికి 1,567 మంది వర్కర్లు, 861 మంది ఆయాలకు రిజిస్టర్ పోస్టు ద్వారా షోకాజ్ నోటీసులు పంపారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. మెటర్నిటీ సెలవులో ఉన్న వర్కర్లు, ఆయాలు, కోర్టు కేసుల వల్ల ఖాళీగా ఉన్న కేంద్రాలు మినహా అందరికీ నోటీసులు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు ప్రాజెక్టుల్లో సీడీపీఓలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసులు అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు వెళ్లి నోటీసులు అతికిస్తున్నారు. అనంతపురం నగరంలోని నేతాజీ నగర్, కృపానంద నగర్, బళ్లారి బైపాస్ తదితర ప్రాంతాల్లో నోటీసులు అతికించారు. ఉరవకొండ, కళ్యాణదుర్గం తదితర ప్రాంతాల్లో సెంటర్లకు నోటీసులు అతికించారు. గడిచిన 48 గంటలుగా అధికారులు నోటీసులను పోస్టు ద్వారా పంపడంపై దృష్టి సారించారు. మిగిలిన అంగన్‌వాడీ కేంద్రాలకు గురువారం నుంచి వెళ్లి నోటీసులు అతికించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పది రోజుల్లో చెప్పండి..

నోటీసులు అందుకున్న వర్కర్లు, ఆయాలు పది రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. 'గత నెల 12వ తేదీ నుంచి ఈ నెల 9వ తేదీ వరకూ.. అంటే 29 రోజులు మీరు విధులకు గైర్హాజరయ్యారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించకుండా ఉన్నారు. మిమ్మల్ని ఉద్యోగం నుంచి ఎందుకు తొలగించకూడదో నోటీసులు అందిన 10 రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలి. లేకుంటే 10 రోజుల తర్వాత మీపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం' అని బెదిరించేలా నోటీసులు జారీ చేస్తున్నారు.

బెదరని అంగన్‌వాడీలు

ప్రభుత్వం షోకాజ్ నోటీసులు ఇస్తున్నా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు బెదరడం లేదు. 30వ రోజు బుధవారం కూడా కలెక్టరేట్ వద్ద వందలాది మంది నిరసనలు తెలిపారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు శంకుంతల, రమాదేవి, జమున ఆధ్వర్యంలో రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపారు. సమ్మె 30 రోజులకు చేరిన నేపథ్యంలో 30 నమూనాలో రోడ్డుపై కూర్చుని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.


కలెక్టరేట్ వద్ద ఆందోళన

బాబుతోనే అంగన్‌వాడీలకు న్యాయం: జేసీ


సమ్మెకు మద్దతు తెలుపుతున్న మాజీ ఎంపీ జేసీ

యాడికి, జనవరి 10: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుతోనే అంగన్‌వాడీ వర్కర్లకు న్యాయం జరుగుతుందని మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి అన్నారు. యాడికిలో అంగన్‌వాడీ వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చంద్రబాబు హయాంలోనే అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో అభివృద్ధి చెందాయని అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలపై వైసీపీ ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శించడం దారుణమని విమర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు న్యాయం జరగాలంటే చంద్రబాబునాయుడు తిరిగి ముఖ్యమంత్రి కావాలని అన్నారు. జేసీ వెంట టీడీపీ నాయకులు చవ్వా గోపాల్‌రెడ్డి, ఆదినారాయణ, పరిమి చరణ్, బొట్టు శేఖర్, రవికుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మధురాజు, విక్రమ్ తదితరులు ఉన్నారు.

మాట తప్పి.. ఎస్మా ప్రయోగిస్తారా..?

ప్రభుత్వంపై మాజీ మంత్రి పరిటాల సునీత ఫైర్

రామగిరి, జనవరి 10: న్యాయమైన డిమాండ్లను అంగీకరించాలని అంగన్‌వాడీలు సమ్మెలోకి వెళ్తే.. వారిపై ఎస్మా ప్రయోగిస్తారా అని ప్రభుత్వంపై మాజీ మంత్రి పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగిరిలో సమ్మె శిబిరానికి వెళ్లి అంగన్‌వాడీలకు బుధవారం ఆమె సంఘీబావం తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ఎస్మా నోటీసుల గురించి అంగన్‌వాడీలతో చర్చించారు. గత ఎన్నికల సమయంలో పక్కరాష్ట్రం కంటే వెయ్యి రూపాయలు అదనంగా వేతనం ఇస్తామని చెప్పిన జగన్.. అధికారంలోకి వచ్చాక మాట తప్పారని విమర్శించారు. ఇచ్చిన హామీ గురించి అడుగుతుంటే కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. అక్కాచెల్లెమ్మలకు అండగా ఉంటానని చెప్పే జగన్.. ఇప్పుడు అంగన్‌వాడీ అక్కాచెల్లెమ్మలను రోడ్డున పడేశారని మండిపడ్డారు. నెల రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా పట్టించుకోకుండా ఎస్మా ప్రయోగిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలో 9,294 మంది అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు ఇచ్చారని, వారు విధుల్లో చేరకపోతే తొలగిస్తారా అని ప్రశ్నించారు. అదే జరిగితే వైసీపీ ప్రభుత్వం ఎక్కడ ఉంటుందో ఆలోచించుకోవాలని హెచ్చరించారు. అంగన్‌వాడీలు గొంతెమ్మ కోర్కెలు కోరడంలేదని.. వేతనం, ఇతర న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని పోరాడుతున్నారని అన్నారు. ప్రభుత్వం మొండి వైఖరివీడి వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, నాయకులు పేపర్ శీన, ముత్యాలప్ప, మాదాపురం శంకర, గుర్రం శీన, సురేశ్, గంగన్న, నాగరాజు, చంద్రమోహన్, మనోహర, వెంకటేశ్, సూర్యనారాయణ పాల్గొన్నారు.


సమ్మె శిబిరం వద్ద మాట్లాడుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత

నగరపాలిక కమిషనర్‌గా మేఘుస్వరూప్



అనంతపురం క్రైం, జనవరి 10: అనంతపురం నగరపాలిక కమిషనర్‌గా మేఘ స్వరూప్ ఐఏఎస్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2019లో ఐపీఎస్‌కు ఎంపికైన మేఘ స్వరూప్, మహారాష్ట్రలో పనిచేశారు. అనంతరం 2021లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. చిత్తూరు అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ)గా పనిచేశారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న మేఘ స్వరూప్‌ను అనంతపురం నగర పాలక కమిషనర్‌గా నియమించారు. ప్రస్తుతం నగర పాలక కమిషనర్ భాగ్యలక్ష్మి విషయంలో స్పష్టత రాలేదు. ఆమె గుంటూరు కమిషనర్‌గా బదిలీపై వెళ్లారనే ప్రచారం జరుగుతోంది. కాగా గతంలో ఐఏఎస్ అధికారి హోదాలో ప్రశాంతి కమిషనర్‌గా పనిచేశారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా

వీరాపురం పెన్నానది నుంచి తరలుతున్న వైనం
పక్క జిల్లాలకు తరలిస్తున్న వైసీపీ నాయకులు
జేసీపీఆర్ ఆందోళనతో కొద్దిరోజులు నిలిపివేత
మరోసారి ఆందోళనకు సిద్ధమవుతున్న ప్రభాకర్ రెడ్డి

తాడిపత్రి, జనవరి10: మండలంలోని వీరాపురం వద్ద గల పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఎక్స్‌కవేటర్ల సాయంతో పదులసంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. ఈ అక్రమ రవాణాను పలుమార్లు స్థానికులు అడ్డుకున్నా ఫలితం లేకపోయింది. పదిరోజుల కిందట తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానికులు ఇసుక తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకున్నారు. అక్కడికి వచ్చిన పోలీసులపై జేసీ ప్రభాకర్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక తరలిస్తున్న టిప్పర్లను వెంటనే సీజ్‌చేయాలని డిమాండ్ చేశారు. దీంతో కొద్దిరోజులు ఇసుక రవాణాను వైసీపీ నేతలు నిలిపివేశారు.


ఇసుకను తరలిస్తున్న టిప్పర్ (ఫైల్)

తిరిగి ప్రారంభమైన ఇసుక రవాణా

ఇసుక తరలింపును అడ్డుకోవడంలో కొంత విరామం ఇవ్వడాన్ని అవకాశం చేసుకున్న వైసీపీ నేతలు తిరిగి తమ కార్యకలాపాలను ప్రారంభించారు. ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, విజయవాడ పేరుతో శాండ్ వేబిల్లు (ఇసుక రవాణా పాసు) తీసుకుని రవాణా చేస్తున్నారు. హౌసింగ్‌స్కీం పేరుతో ఇసుకను తాడిపత్రికి సరిహద్దు జిల్లాలుగా ఉన్న కర్నూలు, నంద్యాలకు రవాణా చేస్తున్నారు. మొదటినుంచి కర్నూలు జిల్లాకు ఇసుక రవాణా జరుగుతుండగా నంద్యాల జిల్లా ఏర్పడినప్పటి నుంచి పెద్దఎత్తున నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇందుకు అవసరమైన ఇసుక పరిసర ప్రాంతాల్లో లేకపోవడంతో బిల్డర్లు తాడిపత్రి వైపు చూస్తున్నారు. పెన్నానది నుంచి ఇసుకను టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా కొను గోలు చేస్తుండటంతో వైసీపీ నాయకులకు ఊహించినదానికంటే ఎక్కువగా ఆయదాయం సమకూరుతోంది.

మరోసారి ఆందోళనకు సిద్ధమవుతున్న మున్సిపల్ చైర్మన్

వైసీపీ నేతలు తిరిగి ఇసుక రవాణాను ప్రారంభించడం పట్ల జేసీ ప్రభాకర్‌రెడ్డి మండిపడుతున్నారు. తిరిగి ఆందోళన చేయడానికి అనుచరులు, స్థానికులను సమాయత్తం చేస్తున్నారు. రెండురోజుల్లో వీరాపురం వద్ద ఇసుక తరలింపును అడ్డుకునేందుకు స్థానికులతో ఫోన్‌లో మాట్లాడుతున్నారు. గతంలో టిప్పర్లు, ట్రాక్టర్లను అడ్డుకొని పోలీసులకు అప్పగించినా ఫలితం లేకపోవడంతో ఈసారి అడ్డుకోవడమే కాకుండా వాటి టైర్లకు గాలితీయడం, ఉన్నతాధికారులను పిలిపించి సీజ్ చేయించడం వంటి వాటికి ఉపక్రమించనున్నట్లు సమాచారం.

ఉయ్యాలవాడ విగ్రహంపై రాజకీయమా..?

ఐదు రోజుల్లో ఆవిష్కరించాలి.. లేదంటే నేనే ఆవిష్కరిస్తా
ప్రభుత్వం తీరుపై మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి ఫైర్



అనంతపురం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణలో రాజకీయాలు ఏమిటని మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి మండిపడ్డారు. అధికారులకు ఐదు రోజులు గడువు ఇస్తున్నానని, ఈ లోగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తే సరి... లేదంటే తానే ఆ పనిచేస్తానని అన్నారు. అనంతపురంలోని తన నివాసంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్‌వారితో మొదట పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని అన్నారు. ఆయనేదో రెడ్డి అని తాను వకాల్తా పుచ్చుకోవడం లేదని, స్వాతంత్ర్య సమరయోధుల్లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డిది ప్రత్యేక స్థానం అని అన్నారు. అలాంటి మహనీయుడి విగ్రహావిష్కరణకు అడ్డుచెప్పడమేమిటని ప్రశ్నించారు. అనంతపురంలో కొందరు మహనీయులు, గొప్పవ్యక్తుల విగ్రహాలు తప్ప.. కూడళ్లల్లో ఏర్పాటు చేసిన ఇతరత్రా విగ్రహాలు గొప్పల కోసం ఏర్పాటు చేసుకున్నవేనని విమర్శించారు. జిల్లా కేంద్రంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణకు అనుమతులు లేవంటూ అడ్డుకోవడం ఎవరికీ మంచిది కాదని అన్నారు. తాడిపత్రిలో విగ్రహాలు పెట్టేందులకు, శంకుస్థాపనలు చేసేందుకు ఉన్న అనుమతులు ఇక్కడ ఎందుకు లేవని ఆయన నిలదీశారు. జిల్లాలో ఇంత మంది రెడ్లు ఎమ్మెల్యేలుగా ఉన్నా, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించలేకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపాల్సిన బాధ్యత ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిపై ఉందని అన్నారు. రెడ్డి సామాజిక వర్గం ప్రజాప్రతినిధులు, అందులోనూ అధికారంలో ఉన్న పెద్దిరెడ్డి, కేతిరెడ్డి ఇలాంటి వాళ్లు అందరూ వచ్చి విగ్రహాన్ని ఆవిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కలెక్టర్ స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నెల 15వతేదీ వరకు గడువు ఇస్తున్నానని, ఆలోపు విగ్రహాన్ని ఆవిష్కరించాలని, లేనిపక్షంలో తానే స్వయంగా ఉయ్యాలవాడ విగ్రహాన్ని ఆవిష్కరిస్తానని జేసీపీఆర్ స్పష్టం చేశారు.

క్రికెట్‌లో రాణిస్తున్న చక్రిక



అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 10: నగరానికి చెందిన శివప్రసాద్, చంద్రకళ దంపతుల కుమార్తె చక్రిక పన్నెండేళ్లకే క్రికెట్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఏడో తరగతి చదువుతున్న చక్రిక కెరీర్ ప్రారంభించిన మూడేళ్లకే జిల్లా స్థాయిలో రాణిస్తోంది. అటు సెలెక్టర్లను, ఇటు కోచ్‌లను అబ్బురపరిచే ప్రతిభతో ఆకట్టుకుంటోంది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనా... వయసురీత్యా అనుమతి పొందలేకపోయింది. చక్రిక తాజాగా అనంత ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో మూడు సెంచరీలు, రెండు హాఫ్ సెంచరీలతో మొత్తం ఏడు మ్యాచ్‌లలో 544 పరుగులు చేసి స్ట్రైక్‌రేట్ 114తో నిలిచింది. ఇప్పటి వరకు జిల్లా స్థాయిలో మూడేళ్లకే సుమారు 25 మ్యాచ్‌లు ఆడింది. ఏపీఎల్‌లో బౌలింగ్‌లో ఆరు వికెట్లు తీసుకుంది. చక్రిక మాట్లాడుతూ.. కౌసల్య కృష్ణమూర్తి సినిమా చూసి తాను స్ఫూర్తి పొందాననీ, జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణించి తన తల్లిదండ్రులకు, జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలనేది తన లక్ష్యమని అంటోంది.

జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్‌లో ఏపీకి రెండోస్థానం



బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర జట్లు

జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్ర జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. మహారాష్ట్రలోని గడ్చిరోలిలో బుధవారం జరిగిన 69వ జాతీయ బాల్ బ్యాడ్మింటన్ ఫైనల్స్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు ఇండియన్ రైల్వేస్ జట్టుతో తలపడి ఓడిపోయింది. మహిళా విభాగంలో రాష్ట్ర జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. పోటీలలో ప్రతిభ చాటిన జట్లకు ఏపీ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయశంకర్ రెడ్డి, వెంకట్రావు, అనంతపురం జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య అభినందనలు తెలిపారు.

ముగిసిన రాష్ట్ర సాఫ్ట్‌బాల్ జట్ల శిక్షణ

స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో రాష్ట్ర సాఫ్ట్‌బాల్ పురుషులు, మహిళా జట్లకు పది రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా శిబిరం బుధవారంతో ముగిసింది. ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు, కార్యదర్శి నాగేంద్ర మాట్లాడుతూ.. ఈనెల 12 నుంచి 14 వరకు తెలంగాణలో నిర్వహించే సౌత్‌జోన్ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు బద్రి, సాయి, సింహాద్రి, రమేష్ పాల్గొన్నారు.

కిరణ్ ఆల్‌రౌండ్ ప్రతిభ



సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో జిల్లా క్రీడాకారుడు కిరణ్‌కుమార్ ఆల్‌రౌండ్ ప్రతిభతో ఆకట్టుకున్నాడు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహి స్తున్న అంతర్ జోనల్ క్రికెట్ పోటీల్లో నార్త్‌జోన్ - సౌత్ జోన్ పోటీలు జరిగాయి. ఇందులో సౌత్‌జోన్ తరపున ప్రాతినిథ్యం వహించిన జిల్లా క్రీడాకారుడు కిరణ్‌కుమార్ 54 పరుగులు, నాలుగు వికెట్లు తీసి ఆల్‌రౌండ్ ప్రతిభ చాటారు.

పాజిటివ్ కేసులు జీరో

అనంతపురం టౌన్, జనవరి 10 : కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాలేదని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆస్పత్రికి వచ్చిన 17 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా.. అందరికి నెగిటివ్ రిపోర్ట్ వచ్చిందని తెలిపారు.

13న ప్రతిభా విద్యార్థులకు పురస్కారాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 10: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి, ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు పూలే ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షట్టా శ్రీధర్ తెలిపారు. బుధవారం ఆ సంఘం కార్యాలయంలో అందుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేసిన ఆయన మాట్లాడారు. శనివారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల డ్రామా హాల్‌లో నందు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయనగరం నాగరాజు, జిల్లా అధ్యక్షుడు పిడుగు శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, జిల్లా కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షుడు గోగుల శ్రీధర్, కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, నారాయణ నాయక్, ఓబులేసు, శంకర్, గోవిందు పాల్గొన్నారు.

డ్రైవర్లపై ఆంక్షలు ఎత్తివేయాలి



మీడియాతో మాట్లాడుతున్న డ్రైవర్లు

గార్లదిన్నె, జనవరి 10: ప్రభుత్వం డ్రైవర్లపై పెట్టిన ఆంక్షలను ఎత్తివేయాలని వివిధ వాహనాల డ్రైవర్లు కోరారు. బుధవారం స్థానిక మీడియాతో మాట్లాడుతూ... ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు వాహనాలు వదిలి పారిపోతున్న డ్రైవర్లపై 10 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.7 లక్షలు జరిమాన విధించాలనే చట్టం ఉందన్నారు. కాగా, ప్రమాదం జరిగినప్పుడు తాత్కాలిక భయంతో కొందరు డ్రైవర్లు వాహనాలు వదిలి పారిపోతున్నారని, అలాంటి వారికి 10 సంవత్సరాలు జైలు శిక్ష వేస్తే వారు కుటుంబ సభ్యులకు దూరమై.. తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. డ్రైవర్లపై ఉన్న ఆంక్షలు ఎత్తివేసి డ్రైవర్లకు సంక్షేమం కోసం చర్యలు చేపట్టాలని కోరారు.

ఆర్టీసీ లక్కీడిప్ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు ఇస్తున్న డీఎం

అనంతపురం కల్చరల్, జనవరి 10 : ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో అనంతపురం - నార్పల రూట్ సర్వీసుల్లో ఏర్పాటు చేసిన లక్కీడిప్ విజేతలకు డిపో మేనేజర్ నాగభూపాల్ బుధవారం బహుమతులు అందజేశారు. ఈ రూట్ సర్వీసుల్లో ప్రయాణికులను ఆకర్షించేందుకు అనంతపురం డిపో ఆధ్వర్యంలో లక్కీడిప్ విధానాన్ని పునఃప్రారంభించారు. మొదటి విజేత నారాయణస్వామి, రెండో విజేత రమాదేవి, మూడో విజేత కృష్ణయ్యకు డీఎం బహుమతులు అందజేశారు.

లేపాక్షిని స్వదేశీ దర్శన్ పథకంలోకి చేర్చాలి

అనంతపురం కల్చరల్ : ఆంధ్రప్రదేశ్‌లోని లేపాక్షి, గండికోట, నాగార్జున కొండలను స్వదేశీ దర్శన్ పథకం కిందకు చేర్చి, ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర పురావస్తుశాఖ డైరెక్టర్ జనరల్ యదుబీర్‌సింగ్ రావత్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

3,727 మందికి వైద్య సేవలు

అనంతపురం టౌన్, జనవరి 10 : జిల్లాలో బుధవారం ఎనిమిది పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులు నిర్వహించామని, వాటి ద్వారా 3,727 మందికి వైద్య సేవలు అందించామని డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి తెలిపారు. మెరుగైన చికిత్స కోసం ఒకరిని రెఫర్ చేయగా, మరో వందమందిని కంటి చికిత్సలకు పంపామని తెలిపారు.

భయపడకండి..అండగా ఉంటాం.!

టీడీపీలో చేరిన వైసీపీ నేతలకు పరిటాల సునీత భరోసా

రామగిరి, జనవరి 10: నియోజకవర్గంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీ విధానాలు, ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి సోదరులతో విసిగిపోయి స్వచ్ఛందంగా టీడీపీలో చేరుతున్నారని, వారిని కొందరు వైసీపీ నేతలు బెదిరిస్తూ అడ్డుకొంటున్నారని మాజీ మంత్రి పరిటాల సునీత మండిపడ్డారు. టీడీపీలో చేరేవారికి తాము అండగా ఉంటామని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. కనగానపల్లికు చెందిన బోయ ఎస్వీ రమణ, బోయ రామ్మోహన్, వేపకుంట గ్రామానికి సాకే వెంకటప్ప, దేవరకొండలింగన్న, గుజ్జుల వెంకటరమణ తదితరులు బుధవారం వెంకటాపురంలో పరిటాల సునీత సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో కొత్తగా వచ్చే నాయకులతో పాటు గతంలో పార్టీని వీడి తిరిగి టీడీపీలోకి చేరే వారికి కూడా ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఇందులో ఎవరూ అనుమానం పెట్టుకోవాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో కనగానపల్లి మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



పరిటాల సునీత సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

చంద్రబాబుతోనే రైతు రాజ్యం

టీడీపీ శింగనమల నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రావణి శ్రీ

గార్లదిన్నె, జనవరి 10: చంద్రబాబుతోనే రైతు సంక్షేమం సాధ్యమని, మూడు నెలల్లో టీడీపీ గెలిచి రైతు రాజ్యం రాబోతోందని శింగనమల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రావణి శ్రీ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని గార్లదిన్నె, సమీప గ్రామాల్లోని బుధవారం ఉదయం పంట పొలాలను ఆమె పరిశీలించారు. రైతులు, కూలీలు ఎదుర్కొంటున్న సాధక బాధలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేయబోయే పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమణప్ప, ఓబిరెడ్డి, ఎంపీటీసీలు శ్రీనివాసులు, విశ్వనాథ్, శివశంకర్‌రెడ్డి, రాయుడు, సామాల మధు, రామకృష్ణ, చల్లానాగరాజు, బిల్ల వెంకటేసు, నాగేంద్ర, పరమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

అనంతపురం రూరల్: కక్కలపల్లి కళావతమ్మ కాలనీలో టీడీపీ నాయకులు బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సత్యసాయి జిల్లా బీసీసెల్ కార్యదర్శి నారా యణ స్వామి, దూదేకుల ఫెడరేషన్ కమిటీ సభ్యులు మసూద్‌వలి పాల్గొన్నారు.



గార్లదిన్నె : పొలంలో కరపత్రాలు అందచేస్తున్న బండారు శ్రావణి శ్రీ

రామగిరి : మండలంలోని పోలేపల్లిలో బుధవారం బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీ ప్రసాద్, తెలుగు యువత మండల అధ్యక్షుడు లింగాశ్రీధర్ నాయుడు పాల్గొన్నారు.





కక్కలపల్లి, పోలేపల్లిలో టీడీపీ నాయకుల ప్రచారం

జేఎన్‌టీయూలో న్యాక్ మాక్ కమిటీ పర్యటన

అనంతపురం సెంట్రల్, జనవరి 10: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం న్యాక్ మాక్ కమిటీ బృందం పర్యటించింది. అన్నా యూనివర్సిటీ, చెన్నై ఎమిరటస్ ప్రొఫెసర్ త్యాగరాజన్ ఆధ్వర్యంలో కళాశాలకు చేరుకున్న కమిటీ ముందుగా వీసీ రంగజనార్దన అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పాల్గొంది. ఈ సందర్భంగా ప్రదర్శన ప్రమాణాలను వివరించిన వీసీ.. సిలబస్ రూపకల్పన, కమ్యూనిటీ సర్వీసెస్ ప్రాజెక్ట్, ఇటర్న్‌షిప్, స్టూడెంట్ ఫ్యాకల్టీ నిష్పత్తి, ఉత్తీర్ణత తదితర అంశాలపై చర్చించారు. అనంతరం కళాశాలలోని పలు విభాగాలను బృందసభ్యులు పరిశీలించారు. కార్యక్రమంలో రెక్టార్ విజయకుమార్, రిజిస్ట్రార్ శశిధర్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, డైరెక్టర్లు, కోఆర్డినేటర్లు, అడహక్ ఫ్యాకల్టీ, సిబ్బంది పాల్గొన్నారు.

బెంచీలను రీమోడల్ చేసిన విద్యార్థులు : కళాశాల విద్యార్థులు వారి నైపుణ్యాలతో ఇంజనీరింగ్ వర్క్‌షాపులోని పరికరాలను ఉపయోగించి వర్క్‌షాప్ ఇన్‌చార్జ్ ఆఫీసర్ ఓం ప్రకాష్ పర్యవేక్షణలో బెంచీలను రీమోడల్ చేశారు. ఆ విద్యార్థులను వీసీ రంగజనార్దన, న్యాక్ కమిటీ మెంబర్ త్యాగరాజన్ అభినందించారు.



మాట్లాడుతున్న వీసీ రంగజనార్దన

నిరుద్యోగి ఆత్మహత్య

అనంతపురం క్రైం, జనవరి 10: ఉద్యోగం లేని కారణంగా స్థానిక కృపానంద నగర్‌కు చెందిన ఫణీంద్ర కుమార్ (24) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సాఫ్ట్‌వేర్‌గా పని చేస్తున్న అతన్ని కొన్ని నెలల క్రితం తొలగించారు. మరో ఉద్యోగం కోసం తీవ్రంగా యత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఇంటివద్దే ఉండేవాడు. జీవితంపై విరక్తి చెందిన ఫణీంద్ర మంగళవారం రాత్రి తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉన్నతాధికారుల ఒత్తిళ్లు.. ఉద్యోగి మనస్తాపం

నగరపాలిక పరిధి టౌన్‌ప్లానింగ్ పరిధిలో ఉన్నతాధికారుల ఒత్తిళ్లకు ఓ ఉద్యోగిని మనస్తాపం చెందింది. ప్రసన్నాయపల్లి రైల్వేగేట్ వద్ద బుధవారం రాత్రి అనుమానాస్పదంగా వెళ్తున్న ఆ ఉద్యోగిని టూటౌన్ బ్లూకోట్ సిబ్బంది గమనించి.. అదుపులోకి తీసుకుంది.

జూదరుల అరెస్టు

స్థానిక సాయినగర్ రెండో క్రాస్‌లోని చిన్నారి హాస్పిటల్ వెనుక బుధవారం రాత్రి జూదమాడుతున్న 13 మందిని టూటౌన్ పోలీసు లు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2,02120 స్వాధీనం చేసుకున్నారు.

మూడు గ్యాస్ సిలిండర్ల సీజ్

అనంతపురం న్యూటౌన్, జనవరి 10: స్థానిక జేఎన్‌టీయూ రోడ్డులోని చౌదరి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో విజిలెన్స్ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. ఇంటి అవసరాలకు వినియోగించాల్సిన మూడు సిలిండర్లను నిబంధనలకు విరుద్ధంగా డొమెస్టిక్ వినియోగానికి వాడుతున్నట్లు గుర్తించి వాటిని సీజ్ చేశారు. యజమాని సురేంద్ర, మేనేజర్ రాముపై కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన సిలిండర్లను వీఆర్‌ఓ ఖుద్దూస్‌కు అప్పగించారు. ఈ తనిఖీల్లో సీఐ వెంకటరమణ, ఏఓ వాసు ప్రకాష్ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

గార్లదిన్నె, జనవరి 10: మండలంలోని మర్తాడు గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని బుధవారం అరెస్టు చేశారు. అతని నుంచి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

17న జడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం విద్య : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 17న నిర్వహిస్తున్నట్లు జడ్పీ సీఈఓ కేతన్ గార్గ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు జడ్పీలోని సమావేశ మందిరంలో ఈ మీటింగ్ ఉంటుందని, సభ్యులు అందరూ హాజరుకావాలని సూచించారు. కాగా ఇప్పటికే రెండుసార్లు జడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా పడిన విషయం విధితమే.

నందితకు అభినందన

అనంతపురం సెంట్రల్, జనవరి 10: ఎన్‌ఎస్‌ఎస్ ఉత్తమ వలంటీర్‌గా రాష్ట్రస్థాయి పురస్కారాన్ని దక్కించుకున్న నందితను ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి బుధవారం తన కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణుప్రియ, సోమశేఖర్, రామకృష్ణ, అధ్యాపకులు భారతి, పల్లవి, రఘురాములు, శ్రీదేవి, ప్రసాద్, అమృతలక్ష్మి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి వాటర్ ట్యాంక్ వితరణ

అనంతపురం అర్బన్ : స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని పురస్కరించుకొని వడ్డెర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం అనంతపురం నగర శివారులోని బెరాకా వృద్ధాశ్రమానికి 500 లీటర్ల వాటర్ ట్యాంక్‌ను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ నగర అధ్యక్షుడు సిమెంట్ పోలన్న, వెంకటరాముడు, పుల్లన్న, సత్యమయ్య, కడియాల కొండన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

'పశుసంవర్ధకశాఖ' ప్రెసిడెంట్‌గా శ్రీనివాసులు

అనంతపురం అర్బన్, జనవరి 10: పశుసంవర్ధక శాఖ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోషియేట్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసులు నియమితులయ్యారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇదివరకు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు సేవలందించేవారు.



శ్రీనివాసులు



శింగనమలలో కబడ్డీ ఆడుతూ నిరసన



నార్పలలో రిలే దీక్షలో..

ఎన్నికల్లో జగనన్నతో ఆటాడుకుంటాం: అంగన్‌వాడీలు

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఇన్నాళ్లూ తమ జీవితాలతో సీఎం జగన్‌రెడ్డి ఆడుకున్నారని, రానున్న ఎన్నికల్లో తాము జగనన్నతో ఆడుకుంటామని అంగన్‌వాడీలు తేల్చి చెప్పారు. సమస్యలు పరిష్కరించాలని వారు చేపట్టిన సమ్మె బుధవారానికి 30వ రోజుకు చేరింది. శింగనమలలో అంగన్వాడీలు కబడ్డీ ఆడుతూ నిరసన వ్యక్తం చేశారు. నార్పలలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు జోక్యా శ్రీదేవి, విజయలక్ష్మి ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. సీకేపల్లిలో ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరసన చేపట్టారు. ఇందులో సీఐటీయూ నాయకుడు లింగన్న, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు రమణమ్మ పాల్గొన్నారు. గార్లదిన్నెలో అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు.





సీకేపల్లి ఐసీడీఎస్ కార్యాలయం వద్ద... గార్లదిన్నె తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీల నిరసన



ఎస్‌ఐకు ఫిర్యాదు చేస్తున్న తెలుగు యువత నాయకులు

మోసం చేసిన సీఎంపై చర్యలు తీసుకోండి

పోలీసులకు తెలుగు యువత నాయకుల ఫిర్యాదు

అనంతపురం అర్బన్, జనవరి 10: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అమలు చేయకుండా యువతను మోసం చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తెలుగు యువత నాయకులు అనంతపురం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం వన్‌టౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లుకు తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, నాయకులు గోపాల్ గౌడ్, వెంకటరామయ్య, మురళీ, అంజి, వేణు ఫిర్యాదు లేఖను అందజేశారు. గత ఎన్నికల ముందు నిరుద్యోగ యువతకు అనేక హామీలు ఇచ్చి వారి ఓట్లతో గెలిచిన జగన్... అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. తద్వారా నిరుద్యోగ యువత ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లి బతకాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక మరికొందరు దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారన్నారు. తీవ్ర నిరాశ,నిస్పృహలతో కొందరు ఆత్మహత్యకు పాల్పడుతున్నారన్నారు. వీటన్నింటికీ సీఎం జగన్ అపద్దపు హామీలే కారణమని, ఈ విషయాలను పరిగణలోకి తీసుకొని జగన్‌పై కేసు నమోదు చేయాలని కోరారు.

అచ్చెన్నాయుడిని కలిసిన జిల్లా నాయకులు



అచ్చెన్నాయుడుతో టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, జనవరి 10: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును జిల్లాకు చెందిన టీడీపీ నాయకులు కలిశారు. బుధవారం మంగళ గిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు కేఎం జకీవుల్లా, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళీ, మోహన్‌కుమార్ ఆయన్ను కలిసి ముందస్తుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

సదస్సులను జయప్రదం చేయండి

మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, జనవరి 10: అనంతపురం అర్బన్‌లో నిర్వహించే జయహో బీసీ, ముస్లిం మైనార్టీ సదస్సులను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 17న జయహో బీసీ సదస్సు, 18న ఎన్టీఆర్ వర్ధంతి, 20న ముస్లిం మైనార్టీల సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఆయా కార్యక్రమాల నిర్వహణకు కమిటీలు ఏర్పాటు చేశామని, పార్టీ నాయకులు, శ్రేణులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

జయహో బీసీ ప్రజాచైతన్య యాత్ర ప్రారంభం



శ్రీహరిపురంలో చైతన్య రథాన్నిప్రారంభిస్తున్న నాయకులు

రామగిరి, జనవరి 10: టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జయహో బీసీ కార్యక్రమానికి సంబంధించి ప్రజా చైతన్య రథాన్ని బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య బుధవారం శ్రీహరిపురం గ్రామంలో ప్రారంభించారు. టీడీపీ బలోపేతానికి బీసీలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పెద్దిరెడ్డి, వెంకటేష్, బడముద్దల వారాది, లింగమయ్య, మల్లెల ఆంజనేయులు, ముత్యాలు, తిరుపాలప్ప, నారాయణస్వామి పాల్గొన్నారు.

ఆర్‌టీఎస్ కో-ఆర్డినేటర్‌గా మదమంచి శ్రీధర్‌నాయుడు



గార్లదిన్నె, జనవరి 10: శింగనమల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఆర్‌టీఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా మర్తాడుకు చెందిన మదమంచి శ్రీధర్‌నాయుడిని ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు నియమించారు. మదమంచి శ్రీధర్ ఐటీడీపీ మండలాధ్యక్షుడిగా పనిచేస్తు పార్టీ సభ్యత్వ నమోదు చేయడంలో తనదైన శైలీలో కృషి చేసి చంద్రబాబునాయుడుతో ప్రసంశలు అందుకున్నారు. దీంతో అతన్ని నియోజకవర్గం ఆర్‌టీఎస్ ప్రొగ్రామ్ కో-ఆర్డినేటర్‌గా నియమించారు.

ఆర్‌ఈఎఫ్ కమిటీ అధ్యక్షుడిగా నారాయణప్ప



అనంతపురం సెంట్రల్, జనవరి 10: ఆర్‌ఈఎఫ్ (రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్) రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎస్కేయూ ఉద్యోగి నారాయణప్ప బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు జీ నాగభూషణం తనకు నియామక ఉత్తర్వులు పంపినట్లు తెలిపారు.

కొత్తవారికే అవకాశాలు కల్పించాలి

గార్లదిన్నె, జనవరి 10 : రాజకీయల్లో మాజీలు కాకుండా కొత్త వారికి అవకాశం కల్పించాలని ఎస్సీ, ఎస్టీ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు కుళ్ళాయప్ప, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు కదిరప్ప మాట్లాడారు. ఈసారి ఎన్నికల్లో తెలుగుదేశం, వైసీపీ పార్టీలు కొత్త అభ్యర్థులకు అవకాశం కల్పించాలన్నారు. నియోజకవర్గంలో దళితులపై దాడులు జరిగినప్పటికి ఎమ్మెల్యే ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. ఎస్సీ నియోజకవర్గంలో దళితులకు సహాయం చేయని వారు తమకు అవసరం లేదని అన్నారు. ఈ సమావేశంలో నాగరాజు, మల్లికార్జున, రామాంజినేయులు, రాజా, పుల్లన్న, రమేష్ పాల్గొన్నారు.

కేన్సర్ కణితి తొలగింపు

అనంతపురం టౌన్ : ఓ వృద్ధుడి మూత్రనాళంలో ఏర్పడ్డ కేన్సర్ కణితిని విజయవంతంగా తొలగించినట్లు కిమ్స్ సవేరా వైద్యులు దుర్గాప్రసాద్, రవిశంకర్ తెలిపారు. బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ... మూత్రంలో రక్తం పోతోందని 75 సంవత్సరాల వ్యక్తి తమ ఆస్పత్రికి వచ్చారని, పరీక్షలు చేయగా మూత్రనాళంలో 8.5 సెంటీమీటర్ల కేన్సర్ కణితి ఉన్నట్లు గుర్తించామని అన్నారు. మూత్రనాళాలలో ట్రాన్సిషనల్ సెల్ కేన్సర్ అరుదుగా వస్తుందని, లాప్రోస్కోపిక్ పద్ధతిలో ఆ కణితిని తొలగించామని, ఆ వృద్ధుడు ఆరోగ్యంగా ఉన్నాడని అన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి సహకరించండి

అనంతపురంరూరల్, జనవరి 10: మార్కెట్ యార్డు అభివృద్ధికి అందరూ సహకరించాలని యార్డు చైర్మన్ ఫయాజ్ అన్నారు. బుధవారం మార్కెట్ యార్డులోని మీటింగ్ హాల్‌లో కమిటీ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి అధ్యక్షతన మార్కెట్ కమిటీ సభ్యులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. మార్కెట్ ఆదాయ వనరులు, అభివృద్ధిపై ఇందులో చర్చించారు. ప్రతి నెలా అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నాగేంద్ర, కేశవకుమార్, యూడీసీ తిరుపాలు నాయక్ పాల్గొన్నారు.

రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మల్లికార్జున



మల్లికార్జున, చిన్నప్పయాదవ్

అనంతపురం విద్య /శింగనమల, జనవరి 10: రైతు సంఘం (ఏఐకెఎస్) రాష్ట్ర కార్యద ర్శిగా తనను ఎంపిక చేసినట్లు చిరుతల మల్లికార్జున బుధవారం ప్రకటనలో తెలిపారు. రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో ఎంపిక చేశారని పేర్కొన్నారు. రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యులుగా చిన్నప్ప యాదవ్, గోవిందు, వన్నారెడ్డి, బండి రామకృష్ణ, పీట్ల రామకృష్ణ, నారాయణస్వామి, లలితమ్మ, వెంకట్రాముడు, వెంటకనారాయణ, గోపాల్, నరసింహులను ఎంపిక చేశారని తెలిపారు.

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన జేసీ పవన్‌రెడ్డి


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన టీడీపీ అనంతపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ పవన్‌కుమార్ రెడ్డి

అనంతపురం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టీడీపీ అనంతపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ పవన్ కుమార్ రెడ్డి కలిశారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో బుధవారం జేసీ పవన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో... తొలిసారిగా పవన్‌రెడ్డి కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అరగంటపాటు సీఎంతో రాజకీయాలపై చర్చించినట్లు పవన్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో... ఏపీకి సంబంధించి నీటివాటా సమస్యలు, వైసీపీ ప్రభుత్వ అరాచకాలు, అసమర్థ పాలనతో దగాపడిన నిరుద్యోగ యువతకు తెలంగాణలో ఉద్యోగావకాశాలు కల్పించాలని సీఎంను కోరినట్లు ఆయన తెలిపారు. మరీ ముఖ్యంగా రాయలసీమ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని కోరారు.

నాలుగేళ్లుగా ఆగిన పింఛన్!

● మంజూరు చేయాలని ఓ వృద్ధురాలి వేడుకోలు


పింఛన్ ఇవ్వాలని వేడుకుంటున్న లింగమ్మ

చెన్నేకొత్తపల్లి, జనవరి 10: తనకు నాలుగేళ్లగా వృద్ధాప్య పింఛన్ రావడం లేదని, మంజూరు చేయించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని మండలంలోని ఒంటికొండ గ్రామానికి చెందిన ఏడు పదుల వయస్సు దాటిని లింగమ్మ వేడుకుంటోంది. ఆమె కొన్నేళ్లుగా పింఛన్ తీసుకుంటోంది. అయితే నాలుగేళ్ల క్రితం ఉన్నఫలంగా పింఛన్‌ను నిలిపేశారు. ఎలాంటి ఆసరా లేక ఒంటరిగా జీవిస్తున్న ఆ వృద్ధురాలి జీవనం దినం ఓ యుగంలా నెట్టుకొస్తోంది. వయస్సు పైబడటంతో కూలి పనికి వెళ్లలేని స్థితిలో ఉన్నానని, పింఛన్ కోసం అధికారుల చుట్టూ అనేకసార్లు తిరిగినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. దీనిపై వెంకటంపల్లి సచివాలయ కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డిని వివరణ కోరగా.. ఒకే రేషన్ కార్డులో అత్తా, కోడలు ఉండేవారని, కోడలికి వితంతు పింఛన్ వస్తుండటంతో అప్పట్లో లింగమ్మకు పింఛన్ తొలిగించార ని తెలిపారు. దీంతో తాము రేషన్‌కార్డులో నుంచి ఆ వృద్ధురాలి వేరు చేసి ఆధార్ కార్డుకు మొబైల్ లింకుతో పాటు బయోమెట్రిక్ చేయించామని, పింఛన్‌కు సంబంధించి అర్హుల జాబితాలో ఉందని, త్వరలో పింఛన్ వస్తుందని తెలిపారు.

ఫారం-7కు ఎక్కువగా దరఖాస్తు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి: టీడీపీ


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

రాప్తాడు, జనవరి 10: మండలంలోని 149, 150 పాలచెర్ల, బొగినేపల్లి పోలింగ్ కేంద్రాల్లో స్థానిక వైసీపీ నాయకులు ఫారం-7కు 5 కంటే ఎక్కువగా దరఖాస్తు చేశారని, రెవెన్యూ అధికారులు వారిపై తగిన చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి రమేష్ తహసీల్దార్‌కు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల మేరకు ఒక వ్యక్తి ఫారం-7కు కేవలం 5 మాత్రమే దరఖాస్తు చేయాలన్నారు. అంతకంటే ఎక్కువ చేసిన వారికి నోటీసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బొగినేపల్లిలో వైసీపీ నాయకులు ఓబిరెడ్డి ఫారం-7కు 22, రామకృష్ణ 18, భాస్కర్‌రెడ్డి 28, కుర్లపల్లయ్య 9, పాలచెర్లలో గంగిరెడ్డి 30 దరఖాస్తులు చేశారన్నారు. వీరిపై గ్రామంలో విచారణ చేపట్టాలన్నారు. బీఎల్‌ఓ, రెవెన్యూ అధికారులు ఆ పని చేయలేదని విమర్శించారు. ఆయా గ్రామాల్లో పని చేస్తున్న బీఎల్‌ఓ కూడా వైసీపీకి అనుకూలంగా పని చేస్తున్నాడని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని పక్షంలో కోర్టును ఆశ్రయించి న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రైల్వే ఆస్పత్రిని తనిఖీ చేసిన సీఎండీ

గుంతకల్లు, జనవరి 10: స్థానిక రైల్వే ఆసుపత్రిని చీఫ్ మెడికల్ డైరెక్టరు (సీఎండీ) సీకే వెంకటేశ్వర్లు బుధవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిని సందర్శించిన సీఎండీ ఐసీయూ పక్కన నిర్మించిన లిఫ్టును ప్రారంభించారు. ఆసుపత్రిలో వైద్య సదుపాయాల తీరు, వైద్య పోస్టుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వార్డులను తనిఖీ చేశారు. రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్ ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు సీఎండీని కలిసి పలు అంశాలపై చర్చించారు. రైల్వే డివిజన్ కేంద్రంలోని ఆసుపత్రిలో ఏడు నర్సింగ్ పోస్టులు, ఫార్మసిస్టు, డాక్టరు, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను భర్తీ చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మస్తాన్, రమేశ్, శర్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఇబ్బందులు పెడితే చర్యలు తప్పవ్

● జేఎన్‌టీయూ, ఎస్కేయూ యాజమాన్యాల హెచ్చరిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం సెంట్రల్, జనవరి 10: ఫీజులు కట్టాలని విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని జేఎన్‌టీయూ, ఎస్కేయూ యాజమాన్యాలు.. కళాశాలలను హెచ్చరించాయి. ఈ మేరకు బుధవారం ఆయా యాజమాన్యాలు వేరు వేరుగా ప్రకటనలు విడుదలచేశాయి. కన్వీనర్ కోటాలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు విద్యాదీవెన సొమ్ము చెల్లించడంలేదని, దీంతో సొంతంగా ఫీజులు చెల్లించాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదనను బుధవారం ఆంధ్రజ్యోతిలో 'చేతులెత్తేసిన జగన్!' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన జేఎన్‌టీయూ, ఎస్కేయూ యాజమాన్యాలు... ప్రభుత్వాన్ని వెనుకేసుకువచ్చే ప్రయత్నంచేశాయి. ప్రతి త్రైమాసికానికి ఒకసారి క్రమం తప్పకుండా ప్రభుత్వం నిధులు విడుదలచేస్తుందని చెప్పుకొచ్చాయి. అయితే బీటెక్ మూడో సెమిస్టర్ పూర్తికావస్తున్నా ఒక త్రైమాసికం మాత్రమే నిధులు విడుదలచేసి రెండు త్రైమాసికాల నిధులను నేటికీ విడుదుల కాలేదు. వసతి దీవెన రూ.20వేలకు గాను రూ.10వేలిచ్చి చేతులెత్తేశారు. ఈ అంశాలపై వర్సిటీల యాజమాన్యాలు ఎందుకు స్పందించడం లేదని బాధిత విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.

ఆకలి కేకలు!


బీసీ సంక్షేమశాఖ కార్యాలయం


ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖల కార్యాలయ సముదాయం

● వసతి గృహాల్లో బువ్వ కష్టాలు..

● మూడు నెలలుగా పెండింగ్‌లో డైట్ బిల్లులు

● సరిపడ బడ్జెట్ కేటాయించని రాష్ట్ర ప్రభుత్వం

● ఉన్న బడ్జెట్‌ను ఎవరికి సర్దాలో తెలియని పరిస్థితుల్లో అధికారులు

● ఇదీ జిల్లాలో సంక్షేమ వసతిగృహాల దుస్థితి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 10: ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలకు బువ్వ కష్టాలు తప్పడం లేదు. ఏళ్ల తరబడి నిధులు రాకపోవడంతో డైట్‌ను అమలు చేయలేని పరిస్థితుల్లో ఆయా వసతిగృహాల వార్డెన్‌లు ఉన్నారు. నెల నెలా కేటాయించాల్సిన డైట్ బిల్లులు ప్రస్తుత ప్రభుత్వం ఐదేళ్లుగా మూడు నెలలకోసారి... ఐదు నెలలకోసారి విడుదల చేస్తుండటంతో అటు అధికారులు... ఇటు వార్డెన్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవేళ మూడు నెలలకోసారి విడుదల చేసినా అదికూడా కేవలం ఒక్క నెలకు సంబంధించిన బిల్లులు విడుదల చేస్తుండటంతో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వసతిగృహాలకు సంబంధించి మూడు నెలలకు సంబంధించిన డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మరికొన్ని డివిజన్లలో అయితే ఏకంగా నాలుగు నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో పేద విద్యార్థులకు అరకొర భోజనం అందుతోందన్న విమర్శలు లేకపోలేదు. ఇలా రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు అందించాల్సిన డైట్ బిల్లుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తుండటంతో వారు కడుపునిండా అన్నం తినే పరిస్థితి లేదు.

బడ్జెట్ కేటాయించని ప్రభుత్వం

బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖలకు సంబంధించి డైట్ బిల్లులు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అరకొర బడ్జెట్‌లు కేటాయించి ఎటూకాకుండా చేసిందన్న విమర్శలు ఆయా శాఖల వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఎస్సీ సంక్షేమ శాఖలో ఇప్పటి వరకూ దాదాపు రూ.3 కోట్లకుపైగానే బడ్జెట్ ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఆ బడ్జెట్‌ను రిలీజ్ చేయాలంటే 58 హాస్టళ్లకు మూడు నెలలకు సరిపడా సరిపోవడం లేదని పేర్కొంటున్నారు. అదేవిధంగా బీసీ సంక్షేమశాఖలో సైతం ఇదే బడ్జెట్ సమస్య వినిపిస్తోంది. కొద్దిపాటి బడ్జెట్‌ను ఏ డివిజన్‌కు ఇవ్వాలో తెలియక ఆ శాఖ అధికారులు తికమకపడుతున్నారనే చెప్పాలి. ఇలా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ విషయంలోనూ సరిపడ నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందన్న విమర్శలు ఆయాశాఖ వర్గాల నుంచే వినిపిస్తున్నాయి.

బడ్జెట్ కొద్దిగానే ఉంది...



మూడు నెలల డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. బిల్లులకు సంబంధించి తమ వద్ద బడ్జెట్ కొద్దిగానే ఉంది. మిగిలిన బడ్జెట్ పైస్థాయి నుంచి విడుదలవ్వాల్సి ఉంది. ఆ మేరకు ఏమైనా బడ్జెట్ వస్తే.. అన్ని డివిజన్లకు కేటాయిస్తాం.

- కుష్బూకొఠారీ, డీడీ, బీసీ సంక్షేమశాఖ

బడ్జెట్ వస్తే.. బిల్లులిస్తాం..



డైట్ బిల్లులకు సంబంధించి మావద్ద 3వ విడత బడ్జెట్ మాత్రమే ఉంది. 4వ విడతకు సంబంధించి బడ్జెట్ రావాల్సి ఉంది. ఆ బడ్జెట్ కేటాయిస్తే మొత్తం మూడు నెలలకు సంబంధించిన బిల్లులు విడుదల చేస్తాం. కొన్నిచోట్ల నాలుగు నెలలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని రిలీజ్ చేసే అవకాశం ఉంది. పైస్థాయి అధికారులను సంప్రదించాం. త్వరలోనే బడ్జెట్ వచ్చే అవకాశముంది.

-మధుసూదన్‌రావు, జేడీ, ఎస్సీ సంక్షేమశాఖ

మూడు నెలలుగా డైట్ బిల్లులు పెండింగ్

జిల్లాలో 58 బీసీ హాస్టళ్లు ఉండగా... 7329 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీటన్నింటికీ అక్టోబరు నుంచి డైట్ బిల్లులు అందాల్సిన ఉంది. మరికొన్ని డివిజన్లలో అయితే సాంకేతిక సమస్యలతో నాలుగైదు నెలల నుంచి బిల్లులు రావాల్సి ఉంది. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా బీసీ సంక్షేమశాఖ వసతిగృహాలకు సంబంధించి దాదాపు రూ.5 కోట్లకుపైగానే బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. అదే విధంగా ఎస్సీ సంక్షేమశాఖ వసతిగృహాలకు సంబంధించి జిల్లాలో 58 ఎస్సీ హాస్టళ్లు ఉండగా... 4927 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఈ హాస్టళ్లకు సంబంధించి సగానికిపైగా నాలుగునెలల వరకూ బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. దాదాపు రూ.5 కోట్ల వరకూ బిల్లులు అందాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఎస్టీ, మైనార్టీ సంక్షేమశఖ వసతిగృహాలకు సంబంధించి రూ.కోటికిపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక జనవరి నెల కలిపితే మరో నెల బిల్లులు పెండింగ్‌లో పడితే ఏం చేయాలోనన్న ఆందోళనలో వార్డెన్లు పడిపోయారు. దీనికిన్నా ముందు ఎన్నికల సమయం కావడంతో ఆలస్యమైతే ఇక మళ్లీ వచ్చే విద్యాసంవత్సరం వరకూ వేచి ఉండాల్సి వస్తుందేమోనన్న ఆందోళన చెందుతున్నారు.

ఆకలితో 'ఆడుదాం ఆంధ్ర'


భోజనం లేకపోవడంతో నీరసంగా కూర్చున్న క్రీడాకారులు


సొంత ఖర్చులతో హోటల్లో భోజనం చేస్తున్న క్రీడాకారులు

శింగనమల, జనవరి 10: రాష్ట్రంలో జగగన్న ఆడుదాం ఆంధ్ర పేరుతో ప్రచార ఆర్భాటాలు చేయడం తప్ప... క్రీడాకారులకు కనీసం సౌకర్యాలు కల్పించడం లేదు. భోజనం వసతి కల్పించకపోవడంతో కొందరు క్రీడాకారులు ఆకలితోనే ఆటలు ఆడారు. బుధవారం శింగనమల జిల్లా పరిషత్ పాఠశాలలో మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలను నిర్వహించారు. మండలంలో నుంచి 13 సచివాలయల నుంచి దాదాపు 350 మంది క్రీడాకారులు ఉదయం శింగనమలకు చేరుకున్నారు. అయితే ఉదయం అల్పాహారం... మధ్యాహ్నం భోజనం సౌకర్యాన్ని అధికారులు ఏర్పాటు చేయలేదు. దీంతో క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొందరు క్రీడాకారులు హోటల్లో తన సొంత డబ్బులతో భోజనం చేయగా.. మరికొందరు ఆకలి బాధ భరిస్తూనే ఆటలు ఆడారు. అధికారులు మాత్రం సచివాలయ సిబ్బందికి, అక్కడికి వచ్చిన పీఈటీలకు మాత్రమే భోజనం పెట్టి చేతులు దులుపుకున్నారు.

పిచ్చికుక్క దాడిలో నలుగురికి గాయాలు


గాయపడిన ధనుష్, చికిత్స పొందుతున్న గౌతమి

గోరంట్ల, జనవరి 10: మండలంలోని కాగానిపల్లిలో పిచ్చికుక్క దాడి చేసిన ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పక్కగ్రామమైన చిన్న నారప్పపల్లి వైపునుంచి ఓ పిచ్చికుక్క గ్రామంలోకి బుధవారం సాయంత్రం ప్రవేశించి సురేష్ అనే వ్యక్తి కుడికాలిపై కరిచింది. అక్కడి నుంచి గ్రామంలోకి వెళ్తూ బూరుగు నాగప్ప ఇంటిముందు అతడి భార్య గంగులమ్మ 18 నెలల మనవడు ధనుష్‌ను ఆడించుకుంటుండగా, బాబుపై పిచ్చికుక్క దాడిచేసి కరిచింది. బాలుడిని వెంటనే రక్షించే ప్రయత్నం చేసిన గంగులమ్మను పిచ్చికుక్క తల, ముఖం, ఎడమచేతిపై తీవ్రంగా గాయపరిచింది. అక్కడే ఉన్న మరో మనవరాలు గౌతమి కుడికాలిపై కరవడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు గాయపడ్డారు. చుట్టుపక్కలవారు గుమిగూడి పిచ్చి కుక్కను చంపివేసినట్లు చెప్పారు. గాయపడిన వారిని గోరంట్ల ప్రభుత్వ ఆసుప్రతికి తీసుకురాగా డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్సలు అందించి, మెరుగైన చికిత్సకోసం 108లో హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

15లోగా ఈ క్రాపింగ్ పూర్తి చేయండి

అనంతపురం అర్బన్, జనవరి 10: జిల్లాలో ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల ఈ క్రాపింగ్‌ను 15వ తేదీలోగా పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ ఆదేశించారు. బుధవారం గుంటూరు నుంచి అన్ని జిల్లాల వ్యవసాయ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీఎం కిసాన్ ఈకేవైసీని నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేసేలా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఆర్బీకేల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏడీఏలు, ఏఓలు పాల్గొన్నారు.

రహదారి మూసేసి.. సభావేదిక

● ఇబ్బందుల్లో ప్రయాణికులు

● ప్రజాప్రతినిధుల తీరుతో విసిగిపోతున్న ప్రజలు


ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన సభావేదిక

లేపాక్షి, జనవరి 10: అధికార ప్రభుత్వంలో విద్యుత్‌శాఖ మంత్రిగా పనిచేస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం లేపాక్షిలో పర్యటించారు. ఆయన రాకకు సభావేదికను లేపాక్షి ప్రధాన రహదారుల్లో సిద్ధం చేశారు. ఎప్పుడో సాయంత్రం 5గంటలకు నిర్వహించే సభ కోసం మంగళవారం రాత్రి నుంచే రహదారిని మూసివేశారు. ప్రధాన రహదారికి సభావేదిక అడ్డుగా వేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో చిలమత్తూరు వైపు నుంచి లేపాక్షి మీదుగా హిందూపురానికి రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రయాణికులతో వెళ్లే బస్సులు బైపాస్ మీదుగా వెళ్లడంతో ప్రజలు తీవ్ర అసహనానికి గురయ్యారు. రహదారిలో సభావేదిక ఏర్పాటు చేయడంతో వ్యాపారులు లబోదిబోమన్నారు. సభావేదిక రహదారిలో కాకుండా ఏదైనా ప్రత్యేక స్థలంలో ఏర్పాటు చేయాల్సి ఉందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు అడ్డుచెప్పలేక వత్తాసు పలుకుతుండటంపై ప్రజలు అసహనాన్ని వ్యక్తం చేశారు. ఓ మంత్రి రాకకోసం 24గంటలు రహదారిని మూసివేయడం ఎంత వరకు సబబమని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నిరుద్యోగులను నట్టేట ముంచిన జగన్


జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న తెలుగు యువత నాయకులు

పెనుకొండ టౌన్, జనవరి 10: ప్రతి ఏటా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఇప్పటి వరకు యువతను ఏ ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా నట్టేట ముంచిన ఘనుడు సీఎం జగన్ అని తెలుగు యువత నాయకులు మండిపడ్డారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అధికార పార్టీ వైసీపీ జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని పోలీసులకు తెలుగు యువత నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే 2.30 లక్షల ఉద్యోగాలు భర్తిచేస్తామని మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన జగన్మోహన్‌రెడ్డి ఐదు సంవత్సరాల కాలంలో నిరుద్యోగులకు మోసం చేశారన్నారు. టీడీపీ హయాంలో రెండుసార్లు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ఈ వైసీపీ పాలనలో ఒక డీఎస్సీ నోటిఫికేషనైనా విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక గత నాలుగు నెలలుగా 21,570మంది ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. జాబ్ రావాలంటే బాబురావాలనే నినాదంతో వైసీపీని భూస్థాపితం చేస్తామన్నారు. పలువురు తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ల నిరసన


గుత్తిలో బీపీసీఎల్ డిపో వద్ద నిరసన తెలుపుతున్న ట్యాంకర్ డ్రైవర్లు

గుత్తి, జనవరి 10: పట్టణ శివారులోని బీపీసీఎల్ డిపో ఎదుట ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్లు బుధవారం నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భారతీయ న్యాయ సహితీ 106-2 హిట్ అండ్ రన్ చట్టం డ్రైవర్లకు శాపంగా మారిందని, ఆ చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ చట్టం వల్ల వాహనాలు రోడ్డు ఎక్కాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఏ డ్రైవర్‌కు ఉద్దేశపూర్వకంగా ప్రమాదాలు చేయాలనే ఆలోచన ఉండదన్నారు. అనుకోకుండా జరిగే ప్రమాదాలకు డ్రైవర్లకు పదేళ్ల జైలు శిక్ష విధించేలా చట్టం తీసుకురావడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ 14వ తేదీ వరకు స్టీరింగ్ డౌన్ పేరిట వాహనాలు నడపకుండా నిరసన చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆయిల్ ట్యాంకర డ్రైవర్ల యూనియన్ నాయకులు రామకృష్ణ, శంకరయ్య, అన్వర్, నారాయణ, షఫీ పాల్గొన్నారు.

సీమకు జగన్ చేసిందేమీ లేదు

● బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్


ప్రసంగిస్తున్న రామచంద్రయాదవ్

అనంతపురం రూరల్, జనవరి 10: కంత్రీ ముఖ్యమంత్రి జగన్ రాయలసీమకు చేసిందేమీ లేదని భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ విమర్శించారు. స్థానిక రుద్రంపేట ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో బుధవారం నిర్వహించిన రాయలసీమ గర్జన సభలో ఆయన ప్రసంగించారు. రాయలసీమకు గొప్ప చరిత్ర ఉందని, నీతి, నిజాయితీ, పౌరుషానికి రాయలసీమ పెట్టింది పేరని అన్నారు. ఉమ్మడి రాష్ట్రానికి అత్యధిక ముఖ్యమంత్రులను అదించింది రాయలసీమ అని అన్నారు. అలాంటి రాయలసీమను ఎవరూ అభివృద్ధి చేయలేదని విమర్శించారు. అన్నారు. దేశంలో అత్యంత ఎక్కువ వలసలున్న ప్రాంతం రాయలసీమ అని అన్నారు. 2019లో తప్పుడు హామీలు, వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌రెడ్డి ప్రభుత్వం ప్రాజెక్టులు, గనులు, సహజవనరులను లూటీ చేసిందని ఆరోపించారు. నీటి ప్రాజెక్టుల పేరిట వైఎస్ జగన్ రూ.37వేల కోట్లు దండుకున్నారని, రాష్ట్రంలో ఒక్క ఎకరానికీ నీరు ఇవ్వలేదని మండిపడ్డారు. వైఎస్ జగన్ తన నాలుగున్నరేళ్ల పాలనలో కడపలో సర్వానాయుడు ప్రాజెక్టును పూర్తి చేశారని, అదికూడా రైతులకు, ప్రజలకు నీరు ఇచ్చేందుకు కాదని అన్నారు. కేవలం తన మేనమామ చేపల చెరువుల కోసం, తన సంస్థ భారతి సిమెంట్ కోసం పూర్తి చేశారని ఆరోపించారు. పారిశ్రామిక అభివృద్ధి పేరుతో వేల ఎకరాలు పోగేసుకుంటున్నారని ఆరోపించారు. కడపలో ఉక్కు పరిశ్రమకు రెండుసార్లు శంకుస్థాన చేసినా, పనులు ప్రారంభించలేకపోవడం జగన్‌మోహన్‌రెడ్డి చేతగాని తనమేనన్నారు.

జడ్పీ సీఈఓగా వైఖోమ్ నైదియా దేవి

● 2021 బ్యాచ్ ఐఏఎస్ అధికారి

● అనంతలోనే తొలి పోస్టింగ్



అనంతపురం విద్య, జనవరి 10: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ కొత్త సీఈఓగా రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎస్ అధికారిని నియమించింది. 2021 బ్యాచ్‌కు చెందిన వైఖోమ్ నైదియా దేవిని జడ్పీ నూతన సీఈఓగా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మణిపూర్ రాష్ట్రానికి చెందిన ఆమె 2016 నుంచి ఐదుసార్లు సివిల్స్ ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. 2020లో యూపీఎస్సీ పరీక్షల్లో 180వ ర్యాంకు సాధించారు. 2021 బ్యాచ్‌కు చెందిన ఆమె శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత అనంతపురం జడ్పీ సీఈఓగా పోస్టింగ్ ఇచ్చారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సీఈఓ భాస్కర్ రెడ్డి సస్పెండ్ అయ్యారు. జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ గతేడాది ఆగస్టు 23 నుంచి అదనపు బాధ్యతలు చేపట్టారు. కొత్త సీఈఓ త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు జడ్పీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

జడ్పీలో ఐఏఎస్‌ల ప్రస్థానం ఇదీ...

గతంలో జిల్లా పరిషత్‌కు జిల్లా అభివృద్ధి అధికారు (డీడీఓ)లు ఉండేవారు. 1981 నుంచి 1994 వరకూ జడ్పీకి జిల్లా అభివృద్ధి అధికారులు(డీడీఓ) పనిచేశారు. తర్వాత సీఈఓలు వచ్చారు. జడ్పీలో ఐఏఎస్‌ల ప్రస్థానం చూస్తే.. కేఆర్ వినాయక్ 1981 వరకు, బీ రామారావు 1982-84 మధ్య, జేసీ మొహంతి 1984లో, బీ అరవింద్ రెడ్డి 1993లో పనిచేశారు. 1994 తర్వాత జడ్పీకి ముఖ్యకార్యనిర్వహణాధికారులు(సీఈఓలు) రాగా ఐఏఎస్ అధికారులైన శశిభూషణ్ కుమార్ 2003-04 వరకు, బి. విజయేందిరా 2013-14 మధ్య పనిచేశారు. తాజాగా కేతన్ గార్గ్ గత ఏడాది ఆగస్టు 23 నుంచి ఇప్పటి వరకూ సీఈఓగా వ్యహరిస్తున్నారు. ఇప్పటి వరకూ ఏడుగురు ఐఏఎస్‌లు జడ్పీకి బాస్‌లుగా వ్యవహరించారు. కొత్తగా నియమితురాలైన వైఖోమ్ నైదియా దేవి విధుల్లో చేరితే 8వ ఐఏఎస్ అధికారి కానున్నారు.

కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి: మాజీ ఎంపీ జేసీ



కుట్టు శిక్షణా కేంద్రాలను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ జేసీ, నాయకులు చవ్వా గోపాల్‌రెడ్డి

యాడికి, జనవరి10: కుట్టు శిక్షణ కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలని టీడీపీ మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి తెలిపారు. చవ్వా ఆదినారాయణరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో యాడికిలో బుధవారం నాలుగు శిక్షణ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ శిక్షణ అనంతరం కుట్టు మిషన్లను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వాటిద్వారా ఉపాధి పెంచుకోవాలని తెలిపారు. కుట్టుశిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసిన చవ్వా గోపాల్‌రెడ్డి సేవలు అభినందనీయమన్నారు. యాడికిలో మొత్తం 10శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేశాడన్నారు. ఒక్కొక్క కుట్టుశిక్షణా కేంద్రానికి వందమంది మహిళలు శిక్షణ తీసుకొనేలా ఏర్పాట్లు చేశారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో చవ్వా ఆదినారాయణరెడ్డి ట్రస్ట్ అధ్యక్షుడు చవ్వా గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆదినారాయణ, తెలుగు యువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పరిమి చరణ్, రైతు కమిటీ జిల్లా కార్యదర్శి రవికుమార్‌రెడ్డి, నాయకులు బొట్టు శేఖర్, లక్ష్మణ్, మధురాజు, విజయ్, చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణస్వామి, విక్రమ్, రామచంద్రారెడ్డి, నీలకంఠరెడ్డి, వెంకట నారాయణరెడ్డి, బయపురెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



టీడీపీలో చేరినవారితో మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్

గుంతకల్లుటౌన్,జనవరి10: మండలంలోని నెలగొండ గ్రామానికి చెందిన ఐదు దళిత కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. పట్టణంలోని జితేంద్రగౌడ్ క్యాంపు కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నెలగొండ గ్రామానికి చెందిన ఐదు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన సునీల్, దుర్గప్రసాద్, ఓబులేసు, చంద్రశేఖర్, జానీ మాట్లాడుతూ వైసీపీలో తమకు సముచిత స్థానం కల్పించలేదన్నారు. దళితుల పట్ల ఈ ప్రభుత్వం చేస్తున్న దాడులు, అరాచకాలు చూసి వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ నాయకులు జింకలజగన్నాథ్, చికెన్ జగన్, చంద్రయ్య, నెలగొండ ఆనంద్, ఎద్దులపల్లివెంకటేష్, వన్నూరప్ప, గుండాల అంజనప్ప, మల్లేష్, శేఖర్, పాలమల్లికార్జున, శ్రీరాములు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పని చేయాలి

దళిత సోదరులు కలిసికట్టుగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ పేర్కొన్నారు. తన క్యాంపు కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వంద రోజులు ప్రజల్లో ఉండాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దళితులపై జరుగుతున్న దాడులు, అక్రమాలు, మహిళలపై అత్యాచారాలను వివరించాలన్నారు.

టీడీపీకి గుండెకాయ రాయదుర్గం: కాలవ



పార్టీలో చేరుతున్న యువకులు

రాయదుర్గం, జనవరి 10: పట్టణం తెలుగుదేశం పార్టీకి గుండెకాయ లాంటిదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పలువురు యువకులను ఆయన తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వెంకటస్వామినాయుడు ఆధ్వర్యంలో 40 మంది యువకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో రాయదుర్గం పట్టణంలో తెలుగుదేశం పార్టీకి 15 వేల మెజార్టీ తగ్గకుండా పని చేయాలని పిలుపునిచ్చారు. 2014-19 మధ్యకాలంలో తాను రాయదుర్గానికి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. టీడీపీ హయాంలో ప్రారంభించిన అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి కావాలంటే మళ్లీ తాను గెలవాలని కాలవ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రశాంతి, పొరాళ్ల పురుషోత్తం, గాజుల వెంకటేశులు, కడ్డిపూడి మహబూబ్‌బాషా, ఇనాయత్ బాషా, కొండాపురం శ్రీనివాసులు, శ్రీరాములు, కోదండ, ఆనంద్, అనిల్‌సింగ్, జయపుత్ర, కొలిమి జయన్న, బాషా, శివానంద, లక్ష్మీనారాయణ, వీ తిప్పేస్వామి, శ్రీధర్, చౌడప్ప, రాము, పాల్గొన్నారు.



రాయదుర్గంలో జగన్ బొమ్మ ముందు ఏడుస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు



తాడిపత్రిలో మూకట్లతో గంజి తాగుతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు



కణేకల్లులో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



బెళుగుప్పలో చెవిలో పూలు పెట్టుకుని భజన చేస్తున్న అంగన్ వాడీ కార్యకర్తలు, హెల్పర్లు



30 సంఖ్య ఆకారంలో కూర్చొన్న అంగన్‌వాడీ వర్కర్లు (యల్లనూరు)



సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు (పుట్లూరు)



గుమ్మఘట్టలో 30వ సంఖ్యగా కూర్చుని సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

సడలని ఉద్యమం

డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మె 30 రోజులు గడచినా ఆగడం లేదు. అంగన్‌వాడీల సంకల్పం సడలడం లేదు. ప్రభుత్వం ఎస్మా ప్రయోగించిన బెదరడం లేదు. ఉద్యమ పంథా వీడటం లేదు. అదే నిరసన ఒరవడిని కొనసాగిస్తున్నారు. తాడిపత్రిలో ప్రధాన రోడ్డుపై కూర్చొని మూకట్లతో గంజి తాగారు. యాడికిలో సమ్మె శిబిరాన్ని మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి సందర్శించి అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు. పలు ప్రాంతాల్లో అంగన్‌వాడీ వర్కర్లు 30 సంఖ్య ఆకారంలో కూర్చొని నిరసన తెలిపారు.

\- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్



గుత్తిలో 30వ అంకె అకారంలో కూర్చుని నిరసన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు



గుంతకల్లులో 30వ సంఖ్య రూపంలో కూర్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు



కుందుర్పిలో 30 సంఖ్య ఆకారంలో కూర్చుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



పామిడిలో దీక్షా శిబిరంలో ఉరివేసుకొని నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



కూడేరులో...



విడపనకల్లులో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



ఉరవకొండలో దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పూజకు తరలిరండి

రాయదుర్గంరూరల్, జనవరి 10: గుమ్మఘట్ట మండలం కలుగోడు గ్రామం వద్ద నిర్వహిస్తున్న శూన్యం మారమ్మదేవత పూజా కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని మాజీ జడ్పీ చైర్మన్ పూల నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇది రాజకీయ వేదిక కాదని తన సొంతతోటలో అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి అక్కడికి వచ్చిన బంధుమిత్రులకు ఒక్కపూట భోజనాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగాధర్, రంగస్వామి, మురళి, శివశరణం, బాగూరప్ప పాల్గొన్నారు.

'జయహో బీసీ'ని జయప్రదం చేయండి: ఉమా

కళ్యాణదుర్గం, జనవరి 10: టీడీపీ ఆదేశాల మేరకు బ్రహ్మసముద్రంలో గురువారం నిర్వ హించే జయహో బీసీ సమావేశాన్ని జయప్రదం చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సమావేశానికి జిల్లా నుంచి బీసీ నాయకులు పెద్దఎత్తున హాజరవుతున్నట్లు తెలిపారు. కావున నియోజకవర్గంలోని వివిధ హోదాల్లో ఉన్న బీసీ నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి డిగ్రీ విద్యార్థిని ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఉరవకొండ,జనవరి10: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి నీరజ జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైంది. ఈ నెల 24 నుంచి 30 వరకూ కర్ణాటకలోని యూత్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో ధార్వాడలో జరిగే పోటీలలో ఈమె పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు. జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లుటౌన్, జనవరి 10: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కింద నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ఇచ్చే ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి వారికి ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశం కల్పిస్తారన్నారు. స్థానిక పీడబ్ల్యుడీ ఆవరణలోని న్యాక్ శిక్షణ కేంద్రంలో నూతన బ్యాచ్ ఈనెల 25నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 7013858450, 9908620306 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఆలయంలో ముగ్గుల పోటీలు

తాడిపత్రిటౌన్, జనవరి 10: పట్టణంలోని అంబాభవానీ ఆలయంలో బుధవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న 18మంది మహిళలు వివిధరకాల రంగవల్లులు వేశారు. విజేతలకు తెలంగాణ స్వకుల సాలె సమాజ్ అధ్యక్షులు రామలింగేశ్వర్, అరుణ దంపతులు బహుమతులను అందించారు. కార్యక్రమంలో నాగేష్, చంద్రశేఖర్, మంజులవాణి, శారద పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు షోకాజ్ నోటీసులు

కళ్యాణదుర్గం, జనవరి 10: మిమ్మల్ని విధుల్లోంచి ఎందుకు తీసివేయకూడదో తెలపాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలకు పోస్టు ద్వారా అధికారులు బుధవారం ఉత్తర్వులు పంపించారు. కంబదూరు ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలందరికీ పోస్టు ద్వారా ఈ లెటర్లను అధికారులు పంపించారు. కంబదూరు, శెట్టూరు, కుందుర్పి మండలాల్లో పనిచేస్తున్న 196 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 177 అంగన్‌వాడీ ఆయాలకు లెటర్లను తయారు చేసి ఆ లెటర్లన్నీ పోస్టు ద్వారా వారికి చేరేలా సిద్ధం చేశారు. సమ్మె కారణంగా బాలింతలు, గర్భవతులు, చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ప్రభుత్వం వెంటనే వారికి మిమ్మల్ని ఎందుకు తొలగించకూడదంటూ షోకాజ్ నోటీసులు అందజేసింది. ఆయా ఐసీడీఎస్ కార్యాలయాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల చిరునామాల ఆధారంగా వారికి లెటర్లను బుధవారం పోస్టు చేశారు. గురువారం నుంచి ఆయా మండలాల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా ఈ ఉత్తర్వులను కూడా అతికిస్తామని అధికారులు చెబుతున్నారు.

చెక్‌పోస్టును తనిఖీ చేసిన ఏఎస్పీ

కుందుర్పి, జనవరి 10 : మండల పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను ఏఎస్పీ హనుమంతు, ఎస్‌ఐ వెంకటస్వామి బుధవారం తనిఖీ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కర్ణాటక నుంచి అక్రమమద్యంను కట్టడి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఎస్‌ఐకి వివరించారు.

35మద్యం బాటిళ్లు స్వాధీనం

యల్లనూరు, జనవరి10: మండలంలోని పీఎం కొండాపురం గ్రామంలో 35మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ ధరణీబాబు తెలిపారు. రమేష్ నాయుడు ఇంటిలో సోదాలు నిర్వహించి మద్యం బాటి ళ్ల స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య

తాడిపత్రిటౌన్, జనవరి10: పట్టణ సమీపంలోని యల్లనూరురోడ్డు రైల్వేట్రాక్‌పై బుధవారం విశ్వనాథ్ (20) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్‌ఐ నాగప్ప తెలిపారు. ఆయన తెలిపిన మేరకు మండలంలోని అక్కన్నపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు, కాంతమ్మ దంపతుల కుమారుడు విశ్వనాథ్ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా విశ్వనాథ్ ప్రేమ వ్యవహారం నడిపాడు. ఇది బహిర్గతం కావడంతో భయపడిన విశ్వనాథ్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ నుంచి జారిపడి మహిళ మృతి

పెద్దపప్పూరు, జనవరి 10: మండలంలోని చిన్న యక్కలూరు గ్రామసమీపంలో బుధవారం ద్విచక్ర వాహనం నుంచి పడి రామలక్ష్మి (26) మృతి చెందిందని ఎస్‌ఐ శరత్‌చంద్ర తెలిపారు. ఆయన తెలిపిన మేరకు పెద్దవడుగూరు మండలం కండ్లగూడూరు గ్రామానికి చెందిన రామలక్ష్మి భర్తతో కలిసి పని కోసం తాడిపత్రికి ద్విచక్రవాహనంలో బయలుదేరింది. చిన్నయక్కలూరు గ్రామ సమీపంలో స్పృహ తప్పి రామలక్ష్మి బైక్‌పై నుంచి కింద పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందిందని తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు. రామలక్ష్మికి నాలుగు నెలల కిందటే వివాహమైంది.

యాడికి వాసికి రైల్వే సేవా పురస్కార్



అవార్డు అందుకుంటున్న ఇలాహి

యాడికి, జనవరి 10: ఆల్ ఇండియా రైల్వే బాల్ బ్యాడ్మింటన్ స్పోర్ట్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన యాడికికి చెందిన ఇలాహి రైల్వే సేవా పురస్కార్ అందుకున్నారు. యాడికిలోని టీచర్స్‌కాలనీకి చెందిన ఇలాహి మండలంలోని వేములపాడు రైల్వేస్టేషన్‌లో అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్‌గా పని చేస్తున్నారు. ఇటీవల నిర్వహించిన ఆల్‌ఇండియా రైల్వే బాల్ బ్యాడ్మింటన్ స్పోర్ట్స్‌లో పాల్గొన్నారు. మంచి ప్రతి భను చూపి ఇలాహి గోల్డ్ మెడల్ సాధించారు. స్పోర్ట్స్ లో ఆయన కనబరిచిన ప్రతిభకు రైల్వే అధికారులు రైల్వే పురస్కార్ అవార్డు ప్రకటించారు. బుధవారం గుంతకల్లులో జరిగిన కార్యక్రమంలో రైల్వే డీఆర్‌ఎం చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నట్లు తెలిపారు.

పామిడికి రాముడి వెండి పాదుకలు

పామిడి, జనవరి 10: పట్టణంలోని భావసార క్షత్రియ కల్యాణ మండపానికి గురువారం అయోధ్య వెండి పాదుకలు వస్తున్నట్లు భక్తులు పేర్కొన్నారు. హైదరాబాదు నగరానికి చెందిన రామ భక్తుడు చల్లా శ్రీనివాస శాస్త్రి అయోధ్య శ్రీరాములు వారికి తయారు చేయించిన వెండి పాదుకలను శృంగేరి, పూరి, పుష్పగిరి, కంచి, ద్వారక పుణ్యక్షేత్రాలలో గల శ్రీ దత్త పీఠాల గురువుల ద్వారా పూజలు చేయించే క్రమంలో భాగంగా పామిడిలోని దత్త మహాయోగ పీఠానికి వస్తున్నాయన్నారు.

జీడిపల్లిలో 0.651 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, జనవరి 10: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో ప్రస్తుతం 0.651 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు బుధవారం తెలిపారు. ఇన్‌ఫ్లో 415 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 600 క్యూసెక్కులు ఉన్నట్లు తెలిపారు.

రెండు స్థానాల్లో పోటీ చేస్తాం: ఎమ్మెల్యే కాపు

రాయదుర్గం, జనవరి 10: కళ్యాణదుర్గంతో పాటు రాయదుర్గం శాసనసభ స్థానాలకు తాను తన కుటుంబసభ్యులు పోటీ చేస్తున్నామని ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ప్రకటించారు. బుధవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీలో ఉన్నంత వరకు తనను నమ్ముకుని చాలా మంది నాయకులు, కార్యకర్తలు ఉన్నారన్నారు. వారికి అండగా ఉండేందుకు రాయదుర్గం నుంచి తమ కుటుంబసభ్యులు పోటీ చేస్తున్నారన్నారు. తాను మాత్రం కళ్యాణదుర్గం నుంచి ఖచ్చితంగా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. ఏమాత్రం ఇతర పార్టీలు అవకాశం ఇచ్చినా పోటీ చేసేందుకు సిద్ధంగానే ఉన్నామని వెల్లడించారు. అదే విధంగా సీడబ్ల్యుసీ సభ్యులు రఘువీరారెడ్డిని కలవడం వెనుక ఎటువంటి రాజకీయ ఉద్దేశ్యాలు లేవన్నారు. అనుభవం కలిగిన రాజకీయవేత్తగా ఉన్న ఆయనను కలిసి కొంత చర్చించామన్నారు. కాంగ్రెస్ నుంచి కళ్యాణదుర్గం నుంచి పోటీ చేస్తున్నట్లు వచ్చిన వదంతుల్లో వాస్తవం లేదన్నారు. కాలవ శ్రీనివాసులుతో తనకు ఎలాంటి వైరం లేదని స్పష్టం చేశారు. రాజకీయ పరంగా మాత్రమే విమర్శలు, ప్రతి విమర్శలు ఉంటాయని, వ్యక్తిగత శత్రుత్వాలు లేవన్నారు.

టీడీపీతోనే మహిళలకు భవిష్యత్తు

పామిడి, జనవరి 10: తెలుగుదేశం పార్టీతోనే మహిళల భవిష్యత్తుకు గ్యారెంటీ అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడుయాదవ్ పేర్కొన్నారు. మండలంలోని నీలూరు, తంబళ్లపల్లి గ్రామాల్లో బుధవారం సాయంత్రం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు తెలుగుదేశం పార్టీతోనే గ్యారెంటీ ఉందన్నారు. 2024 ఎన్నికల్లో నారా చంద్రబాబునాయుడు సీఎం అయితేనే రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి దిశగా దూసుకువెళ్తుందన్నారు. టీడీపీలో మహిళలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. అందుకే మహిళలను లక్షాధికారులను చేసేందుకు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారన్నారు. మహిళలు మహాశక్తిగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో గుంతకల్లు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బండారు ఆనంద్, టీడీపీ మండల కన్వీనర్ ముసలిరెడ్డి, టీడీపీ నాయకులు రామాంజనేయులుయాదవ్, లక్ష్మీకాంతరెడ్డి, తిప్పన్న, రంగారెడ్డి, రాము, భాస్కర్, ఓబులయ్య, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజూ దివ్యాంగురాలి ధర్నా



ధర్నా చేస్తున్న దివ్యాంగులు

విడపనకల్లు, జనవరి 10: మండలంలోని కరకముక్కల గ్రామానికి చెందిన హరిజన పెద్ద సుంకన్న, తిప్పమ్మల కూతురు ఎర్రెమ్మ పుట్టుకతో దివ్యాంగురాలు ఈమె కు తండ్రి రాయించి ఇచ్చిన స్థలాన్ని అదే గ్రామానికి చెందిన వలంటీరు, వైసీపీ నాయకులు కలిసి ఆక్రమించారు. ఈ విషయమై మంగళవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట తన తల్లితో కలిసి ధర్నా చేశారు. అయినా అధికారులు పట్టించు కోక పోవటంతో మండల దివ్యాంగుల ఆధ్వర్యంలో బుధవారం కూడా తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బండలు పాతి ఆక్రమించిన స్థలాన్ని ఖాళీ చేయించాలని కోరారు. గ్రామంలోని వైసీపీ నాయకులు అండతో, గ్రామ వలంటీరు చిన్న వీరేష(ఈరన్న) తన వదిన ముండ్ల యశోదమ్మ పేరున నకిలీ పట్టాను చేయించారన్నారు. నకిలీ పట్టాను రద్దు చేసి మానసిక దివ్యాంగురాలికి న్యాయం చేయాలన్నారు. తహసీల్దారు ఈరమ్మ మాట్లాడుతూ స్థలాన్ని సర్వే చేయించి దివ్యాంగురాలికి న్యాయం చేస్తామన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ఉరవకొండ,జనవరి10: దళిత రైతుపై దాడి చేసిన అధికారపార్టీ నాయకులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని టీడీపీ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షులు నరేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని వెలిగొండ గ్రామంలో ఈ నెల 7వ తేదీన దళిత రైతు రామాంజనేయులుపై అధికార పార్టీకి చెందిన నాయకులు కర్రలతో దాడి చేయడం దారుణమన్నారు.

'న్యాయం చేయకపోతే ఉద్యమిస్తాం'



తహసీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు

కళ్యాణదుర్గం, జనవరి 10: పేదలైన ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి హెచ్చరించారు. బుధవారం కంబదూరు మండల తహసీల్దార్ నయాజ్ అహమ్మద్‌ని జేఏసీ ఆధ్వర్యంలో కలిసి ఎస్సీ, ఎస్టీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ మండలంలోని దళిత గిరిజనుల సమస్యలు పేరుకుపోయినా పట్టించుకునే నాథుడు కరువయ్యారన్నారు. ఇల్లులేని దళిత, గిరిజనులు జగనన్న ఇంటి పట్టాలు కావాలని అడిగితే మంత్రి చెబితేనే ఇస్తామని రెవెన్యూ అధికారులు చెప్పడం అన్యాయమన్నారు. రెవెన్యూ అధికారుల దగ్గరికి సమస్యల మీద వచ్చిన దళిత గిరిజనుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పొంతనలేని సమాధానాలు చెబుతూ దాటేస్తున్నారని ఆవేదన చెందారు. దళిత స్వతంత్ర్య సమర యోధులు హిందీ నరసప్ప, లక్ష్మీ దేవమ్మల పేర్లు మీద స్మృతి వనాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎరుకుల సంక్షేమ సంఘం సుబ్బరాయుడు జేఏసీ తాలుకా మండల అధ్యక్షులు చెలిమప్ప, డాబా రమేష్, సీనియర్ నాయకులు, ధన, తిమ్మప్ప, వంటారెడ్డిపల్లి నాగరాజు, అండేపల్లి నాగన్న, కురాకులపల్లి గోపాల్, చిన్నేపల్లి ప్రతాప్, జక్కిరెడ్డిపల్లి, నరసింహులు, రామకృష్ణ, ఓబుళేసు, ఈశ్వర, నాగేంద్ర, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లులో ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు



రాజమండ్రి వద్ద గోదావరిలో హామీ పత్రాలను వదులుతున్న సీపీఐ నాయకులు



గుత్తిలో సూర్యనమస్కారాలతో నిరసన

కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె

గుంతకల్లుటౌన్/గుత్తి, జనవరి10: మున్సిపల్ పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం 16వ రోజు కొనసాగింది. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. గుత్తిలో సూర్యనమస్కారాలు చేస్తూ నిరసన తెలిపారు. గుంతకల్లు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేని అసమర్థ సీఎం జగన్ అని మండిపడ్డారు. సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెకు వామపక్షాల నాయకులు మద్దతు పలికారు.